31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

## సీఎంను కలిసిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఫిబ్రవరి 24:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ గెలుపొందగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావులతో కలిసి మర్యాద



పూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. నూతనంగా మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్లు గెలుపొందిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెట్ పల్లి మున్సిపల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళిక అంశాలను సీఎం -2లో

# స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి.. లక్ష్యంగా ముందుకు

**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**





**చురకలు ప్రతినిధి, ధర్మపురి, ఫిబ్రవరి 24 :** గోదావరి నది పవిత్రతను కాపాడలనే లక్ష్యంతో స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి.. కార్యక్రమాన్ని తీసుకున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. తాము తీసుకున్న ఈ నిర్ణయానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించి గోదావరి పవిత్రతను కాపాడే బాధ్యతలో భాగస్వాములు కావాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి మున్సిపాలిటీకి కొత్తగా ఎన్నికైన పాలకవర్గం ఆధ్వర్యంలో గోదావరి నది పవిత్రతను కాపాడే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి. కార్యక్రమాన్ని మంగళవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి గోదావరి తీరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారని అన్నారు. ధర్మపురి పవిత్రత పెంపొందించడంతో పాటు గోదావరి పవిత్రత కాపాడాలని లక్ష్యంతో తాము స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి.. కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. గోదావరి నది స్వచ్ఛతను కాపాడడానికి పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. గోదావరి పవిత్రత కోసం స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు ముందుకు వచ్చి ప్రతిరోజు స్వచ్ఛ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కోరారు. ధర్మపురి లో పుట్టి పెరిగిన వారు ఇక్కడి రుణం తీర్చుకోవడానికి ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పాల్గొనాలని మంత్రి కోరారు. గోదావరి నది పవిత్రతను కాపాడడానికి భక్తులు సైతం సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. భక్తులు తమ వెంట తీసుకువచ్చిన పాత బట్టలు ఇతర వస్తువులు సూచించిన ప్రదేశాల్లో వేయాలని గోదావరి నీటిలో వేయడం వలన నది కలుషితం అవుతుందని మంత్రి అన్నారు.

**27న ధర్మపురికి కన్సల్టెన్సీ ప్రతినిధులు..**

2027 జూన్ లో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఇప్పటి నుండి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురిలో చేపట్టే అభివృద్ధి పనుల అంచనాలు తయారు చేయడానికి ఈనెల 27న ప్రభుత్వం నియవి మించిన కన్సల్టెన్సీ ప్రతినిధులు వస్తున్నారని మంత్రి తెలిపారు. ధర్మపురి పట్టణ ప్రజలు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనేక సంవత్సరాలుగా ధర్మపురి బ్రాహ్మణులు, అగ్రహారం పెద్దలు తమ అమూల్యమైన సలహా సలహాలు, సూచనలు అందించాలని మంత్రి కోరారు. ధర్మపురి పట్టణంలో మిగిలి ఉన్న డ్రైనేజీ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి లోని డంపింగ్ యార్డ్ సమస్యకు ఒక పరిష్కారం త్వరలోనే చూపిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

**మంత్రి అడ్లూరి సహకారంతో ముందుకు.. మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి..**

ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ మంత్రి అడ్లూరి అందించిన స్ఫూర్తితోనే తాము స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి.. కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మొదటి రోజు సుమారు 100 మంది స్వచ్ఛందం గా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారని ఆమె తెలిపారు. స్వచ్ఛ గోదావరి కార్యక్రమాన్ని మంత్రి గారి సహకారంతో 365 రోజులు నిర్వహించ డానికి ఏర్పాట్లు చేస్తున్నామని -2లో

### ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన

# రైతులను ఆదుకోవాలి





**-ఎకరా 20 వేలు నష్టపరిహారం అందించాలి**
**-బడ్జెట్ సమావేశంలో పంట నష్టం, రైతు భరోసా పై నిర్ణయం తీసుకోవాలి**
**-ఫిబ్రవరి చివర్లో రైతు భరోసా అందించాలి**
**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి, రాయికల్, ఫిబ్రవరి 24:** ఆరుకాలం కష్టపడి పండిం చిన పంట కోతకు వచ్చే దశలో పకృతి వైపరీత్యంతో అకాల వర్షం, ఈదురు కాలులతో పంట నష్టపోయిన మొక్క జొన్న, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న, మామిడి పంటలను రాయికల్ మండలంలోని రామజిపేట్ గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్, వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి -2లో

### గోదావరి పుష్కరాలు- 2027కు

# కట్టుదిట్టమైన భద్రతా ప్రణాళిక

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 24 :** గోదావరి పుష్కరాలు-2027కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు సంబంధించి భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పుష్కరాలు జరిగే ప్రాంతాల పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సంబంధిత సిఐలు, డిఎస్పీలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖ తరపున చేపట్టాల్సిన సమగ్ర భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, పార్కింగ్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల విస్తృత ఏర్పాటు, మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు, విఐపీ ఘాట్లు, పుష్కర ఘాట్లు మరియు తాత్కాలిక స్నాన ఘాట్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పుష్కరాలను పురస్కరించుకొని జిల్లాకు ప్రతిరోజు సుమారు 15 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారి భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గత పుష్కరాల అనుభవాలను -2లో

## ఇన్సూరెన్స్ బీమా చెక్కు అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (బోధన్) ఫిబ్రవరి 24 :** నిజామాబాద్ జిల్లా బోధన్ కు చెందిన జయశ్రీ కి 8 లక్షల రూపాయల చెక్కును శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు అందజేశారు.నిజామాబాద్ జిల్లా బోధన్ ఏరియా పరిధిలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ నందు బోధన్‌కు చెందిన దిగంబర్ 4 సంవత్సరాల క్రితం పాలసీ తీసుకుని ఇటీవల అనారోగ్యం తో మృతి చెందడం జరిగింది. వారి కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 8,00,000/-లి లిరూపాయలు కంపెనీ డీజీఎం సురేష్ మరియు,డి ఎం నగేష్ ద్వారా నామిని అయినటువంటి భార్య జయ శ్రీకు అందజేశారు.ఇట్టి కార్యక్రమంలో డీజీఎం సురేష్,డి ఎం నగేష్, మేనేజర్ సౌందర్య ఎంప్లాయి రాఘశ్రీ డెవలప్మెంట్ ఆఫీసర్ రవీందర్ ప్పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 24 :** కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. పంట నష్టపోయిన రైతులతో కలిసి నష్టపోయిన పంటను మంగళవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు.కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. జగిత్యాలలో నియోజకవర్గంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఈదురు గాలులతో కూడిన వర్షంతో మామిడి మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రాయికల్ మండలంలోని రామాజీపేట జగిత్యాల అర్బన్ మోతె, జిల్లాలో పలు గ్రామాలలో రైతులకు బారి నష్టం వాటిల్లిందని అన్నారు.రామోజీ పేట్ గ్రామంలో కొత్త వెంకటేష్ కౌలు రైతు నిర్మల్ నుండి వచ్చిన వలస కూలి తీవ్రంగా పంట నష్టపోయారన్నారు. పంట బీమా పథకం లేనందున ప్రభుత్వమే ఎకరాకు 20,000 నష్ట పరిహారం అందించాలన్నారు.రైతు దేశానికి వెన్నుముక అలాంటి రైతును రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డ అని రైతుల పక్షాణ దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం రైతులను అదుకుటుందని ఆశిస్తున్నట్లు వారికి హామీ ఇచ్చారు.రాష్ట్ర రైతాంగానికి ఫిబ్రవరి చివరిలోగా రైతు భరోసా అందించి రైతుకు అండగా నిలవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

## సీఎంను కలిసిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

**మొదటి పేజీ తరువాయి..** రేవంత్ రెడ్డితో ఈ సందర్భంగా వారు చర్చించారు. మెట్ పల్లిని ఆదర్శవంతమైన మున్సిపల్ గా తీర్చిదిద్దడానికి ముందుండి పనిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లికి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ధర్మపురి.. స్వచ్ఛ గోదావరి..

**మొదటి పేజీ తరువాయి..** చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తో పాటు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన...

**మొదటి పేజీ తరువాయి....** నివేదిక అందించాలన్నారు.అనంతరం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడు తూ పంట నష్ట భీమ పథకం అమలు లేనందున పకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేలు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయ అంశం మాత్రమేనని తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి మేలు కలిగే రైతు భరోసా నిధులు ఈనెల ఫిబ్రవరి చివర్లో విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కాబట్టి రైతుల పక్షాణ దృష్టి సాధించి దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,నాయకులు తంగేళ్ల రమేష్,ఎద్దండి భూమారెడ్డి,కొయ్యేడి మహిపాల్,దాసరి గంగాధర్,కడకుంట్ల నరేష్,మున్ను,ఎద్దండి లింగారెడ్డి, బాపురపు నర్సయ్య,కొమ్ముల ఆదిరెడ్డి, బత్తిని భూమయ్య,షాకీర్,మండ రమేష్, నాగరాజు,రాజీవ్, హరీష్ పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు- 2027కు...

**మొదటి పేజీ తరువాయి....** విశ్లేషించి, ఈసారి మరింత కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన స్నాన ఘాట్లు, మంగళ ఘాట్, విఐపీ ఘాట్లు, పుష్కర హారతి ప్రదేశాలు, ఇరుకు రహదారులను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని తెలిపారు. ప్రతి ఘాట్కు ప్రత్యేక అత్యవసర మార్గం కేటాయించి అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేసి, వాహనాల రాకపోకలకు వన్వే మరియు ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని, పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో డిఎస్పీలు రఘు చందర్, రాములు, సి.ఐలు అనిల్ కుమార్, సుధాకర్, పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 24 :** మార్చి 14 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే చీఫ్ సూపరిండెంట్లను ఆదేశించారు.పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్ లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు. డిపార్ట్మెంట్ ఆఫీసర్లు ఫ్లయింగ్ స్క్వాడ్స్, వాహనాల ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 73 రెగ్యులర్, 1 ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు




పదో తరగతి పరీక్షలు జరుగుతాయని పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఫ్యాన్లు తాగునీటి వసతి కల్పించడంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చాలా పకడ్బందీగా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. నిబంధనలు ఎక్కడా అతిక్రమించవద్దని నిబంధనల ప్రకారం పరీక్షలు సజావుగా సాగేలా అందరు సహకరించాలని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 650 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థులు సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు వచ్చేలా వాహన సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం లో పదో తరగతి పరీక్షలు విజయవంతంగా ముగిసేలా సమిష్టిగా అందరం కలిసి కృషి చేద్దామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణపై నియమాలు నిబంధనలు పాటించాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏడి మాధవి ఏసీజీఈ సంధ్యారాణి, డిసిఈబి కార్యదర్శి భగవంతయ్య, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాసు కృపారాణి, ఆంజనేయులు అధికారులు పాల్గొన్నారు.

# చల్లారని "వీణవంక జాతర" మంటలు

**(చురకలు ప్రతినిధి హుజురాబాద్):** హుజురాబాద్ నియోజకవర్గం లో వీణవంక జాతర మంటలు చల్లారడం లేదు. వీణవంకలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దె వద్దకు వెళుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో పాటు ఆయన సతీమణి, కుమార్తెను పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయమై స్థానిక రాజకీయాల్లో తీవ్రదుమారం చెలరేగింది. జాతరకు వెళ్తున్న తనను ఎలా అడ్డుకుంటారంటూ కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి ని అరెస్టు చేసి అక్కడి నుండి సైదాపూర్ పోలీస్ స్టేషన్కు తరలించి తదనంతరం విడుదల చేశారు. తన అరెస్టు వెనుక సీఎం రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఎమ్మెల్యే కౌశిక్ ఆరోపించారు.




కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఐపీఎస్ అధికారుల సంఘం మండిపడింది. తనపై దురుద్దేశంతో సిపి గౌస్ ఆలం మతమార్పిడి అని తాను అనుకున్నప్పటికీ అన్నట్టుగా అసత్య ఆరోపణలు చేశారని దీనిపై సభా హక్కుల నోటీసు ఇస్తానని కూడా కౌశిక్ ఇప్పటికే స్పష్టం చేశారు. కాగా కౌశిక్ తను సీపీపై చేసిన ఒక "వ్యాఖ్య"కు సంబంధించి క్షమాపణ కూడా చెప్పారు. ఇటీవల కౌశిక్ ప్రతిరోజు ఏదో ఒక ఛానల్లో ఈ అంశం గురించి ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ కేసులో సిఐడి అధికారులు ఎంట్రీ ఇచ్చారు. తాజాగా మంగళవారం వీణవంకకు వెళ్ళిన సిఐడి అధికారులు ఈ సంఘటన పూర్వపరాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. జాతరలో ఏదైనా గొడవ సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నం చేశారా? అన్న కోణంలో వారు విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆరోజు అక్కడ ఉన్న కౌశిక్ రెడ్డి అనుచరుల ఫోన్ కాల్స్ వివరాలను సేకరిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై కౌశిక్ రెడ్డి అనుచరులు మండి పడుతున్నారు. తమను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అందులో భాగంగానే సిఐడి అధికారులు వచ్చారని వారు ఆరోపిస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఓ చానల్లో కౌశిక్ రెడ్డి, స్థానిక ఏసీపి వాసంశెట్టి మాధవి మధ్య జరిగిన డిబేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తనను ఎలా సమ్మక్క గద్దెపై ఉండగా లాక్కు వెళ్తారని, ఎమ్మెల్యేగా తనకు హక్కు లేదా? కౌశిక్ రెడ్డి ఆ వీడియోలో ప్రశ్నించారు. సిఐడి ఎంట్రీ తో ఈ వ్యవహారం ఎలాంటి మార్పులు తిరుగుతుందోననే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# సంగెం గ్రామ రైతులకు నానో ఫర్టిలైజర్ అవగాహన కార్యక్రమం

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి 24 :** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో వ్యవసాయ శాఖ సంయుక్తంగా సంగెం గ్రామంలో నూనె గింజ పంటల సాగు యాజమాన్యం నానో ఫర్టిలైజర్లపై రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమణి కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆగ్రోనమీ బి. సౌమ్య మాట్లాడుతూ వేసవి కాలంలో సాగు చేయడానికి నువ్వు పంట అనుకూలమైన నూనె గింజల పంట అని తెలిపారు దీనికి తక్కువ పెట్టుబడి స్వల్పకాల వ్యవధి ఉండటంతో పాటు ఎగుమతులకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు తక్కువ నీటి వనరులతో అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చని చెప్పారు. నువ్వు పంటలో అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన ఎరువుల యాజమాన్యం నీటి నిర్వహణ కలుపు నివారణ పురుగులు మరియు తెగుళ్ల నియంత్రణపై వివరించారు అలాగే నానో ఫర్టిలైజర్ల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వాటిని ఉపయోగించే విధానాన్ని రైతులకు తెలియజేశారు. హార్టికల్చర్ అధికారి వనోజ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్‌సాగు ప్రాముఖ్యతను వివరించారు తోట నాటిన మూడు సంవత్సరాల తరువాత దిగుబడి ప్రారంభమై సుమారు 30 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు మొదటి మూడు సంవత్సరాల వరకు వేరుశనగ సోయా ప్రత్తి పెసర మినుములు శనగ కుసుమ పసుపు జొన్న మక్క సజ్జ ఎర్రజొన్న వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్ గ్రామ సర్పంచ్ చీటి స్వరూప వెంకట్రావు ఉప సర్పంచ్ సుదవేని మహేష్ ఏఎంసీ డైరెక్టర్ వెంకటగౌడ్ ఆత్మ ఆఫీసర్ నవిత గ్రామ రైతులు పాల్గొన్నారు.



# పెన్షనర్లకు సత్వర సేవలు అందిస్తాం

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి 24 :** కోరుట్ల సబ్ ట్రెజరీ అధికారి ఎన్. లావణ్య మాట్లాడుతూ పెన్షనర్లకు ట్రెజరీ శాఖ తరఫున సత్వర సేవలు అందిస్తామని తెలిపారు మంగళవారం కోరుట్ల డివిజన్ కేంద్రంలో టి.పి.సి.ఏ. కోరుట్ల డివిజన్ కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంగా ఆయన స్వగృహానికి పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ జిల్లా డివిజన్ ప్రతినిధులు వెళ్లి పరామర్శించారు అనంతరం సబ్ ట్రెజరీ అధికారి ఛాంబర్లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన పెన్షనర్ల పిలుపు పత్రికలను ఎన్.లావణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సంఘాల ప్రతినిధులను అభినందించారు పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ కోరుట్ల డివిజన్‌లో ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లకు వేతనాలు పెన్షన్లు మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులను సకాలంలో మంజూరు చేస్తున్న ఎస్.టి.ఓ లావణ్య సిబ్బంది సేవలను కొనియాడారు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి పెండింగ్‌లో ఉన్న డి.ఏలు పి.ఆర్.సీ తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ పెన్షనర్ల అధ్యక్షులు పబ్బా శివానందం ఉపాధ్యక్షులు ఎం.డి. సైఫోద్దీన్ కోశాధికారి ఎన్. లక్ష్మీనారాయణ రాజయ్య చిలుక గంగారాం గుంటుక సాంబమూర్తి జిల్లా కార్యదర్శి పి. హన్మంత్ రెడ్డి కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం ఉపాధ్యక్షులు ఎం.డి. యాకుబ్ ఎస్.టి.ఓ సిబ్బంది శ్రీనివాస్ చందూ తదితరులు పాల్గొన్నారు.



# త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

## -జగిత్యాల ఎన్పిడిసిఎల్ ఎస్ఈ సుదర్శనం

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 24 :** రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు గరిష్ట స్థాయిలో మంజూరు చేసినట్లు జగిత్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జగిత్యాల పరిధిలో డిసెంబర్ నెల నుండి ఇప్పటివరకు మొత్తం 656 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. పంటల కోత కాలం ముగియడంతో, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యుద్ధ ప్రాతిపదికన అత్యధిక సంఖ్యలో సర్వీసులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో వేగం కొనసాగుతుందని ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్ ఫార్మర్లు మరియు ఇతర అవసరమైన మెటీరియల్ సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అధికారుల సమన్వయం, సత్వర చర్యల ఫలితంగా సర్వీసుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందని ఎస్ఈ తెలిపారు.



# రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సుకు ఎంపిక

చురకలు విలేకరి, రాయికల్, ఫిబ్రవరి 24 : ఫిబ్రవరి 28 న జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సుకు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు రూపొందించిన పరిశోధన పత్రం సృజనాత్మక బోధన ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 28 న హైదరాబాద్ లోని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థలో అభయ్ రాజ్ తన ప్రదర్శనను వివరిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సంస్థకు ఎంపికైన అభయ్ రాజ్ ను జిల్లా విద్యాధికారి రాము,మండల విద్యాధికారి రాఘవులు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, గ్రామ సర్పంచ్ గుమ్మడి సంతోష్, ఉప సర్పంచ్ కొడిమ్యాల శేఖర్ తదితరులు అభినందించారు.



# రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి మంత్రి అడ్లూరికి ఆహ్వానం



**చురకలు,విలేఖరి,వెల్గటూర్ ఫిబ్రవరి 24 :** జగిత్యాల జిల్లా మండల కేంద్రం వెల్గటూర్ లో నిర్వహించనున్న గౌడ కులస్థుల ఇలవేల్పు శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం, ఎల్లమ్మ పట్నాల్లో పాల్గొనాలని కోరుతూ మంగళవారం ధర్మపురి క్యాంప్ కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను వెల్గటూర్ గౌడ కుల సంక్షేమ సంఘం నాయకులు ఆహ్వాన పత్రిక ను అందజేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల గోడ పత్రికను మంత్రిచేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో సంఘ నాయకులు మాజీ సర్పంచ్ మేరుగు మురళి గౌడ్, గడ్డంసత్యానార్యాయణ,బందెల ఉదయ్, మేరుగు నరేష్, బట్టు భూమయ్య, శేఖర్, మేరుగు అశోక్, బందెల నరేష్,తదితర గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# జాతరలో శిశువు మృతి ఘటనపై బహుజనుల నిరసన



**చురకలు,విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 24 :** ఇటీవల జరిగిన కుమ్మెరగుట్ట మల్లన్న జాతరలో శిశువు మరణించిన ఘటనపై జగిత్యాల జిల్లా మండల కేంద్రం వెల్గటూర్ అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం బహుజనుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జాతరలో రెండు నెలల శిశువు మరణించిన సంఘటనపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిశువు మృతికి రెండునిముషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. నిందితులను శిక్షించాలని నినదిస్తూ ర్యాలీతీశారు. జాతరలో పెత్తనం చేలాయించే అగ్రకుల నాయకులే ఈ ఘటనకు కారమణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ పత్తిపాక వెంకటేష్,రజక సంఘం నాయకులు పుట్టపాక రాజయ్య,ధర్మారం,ఎండ పల్లి మండలాల బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**చురకలు విలేకరి,జగిత్యాల,ఫిబ్రవరి 24 :** జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ లో గల శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ చిన్నారుల విద్యలో మొట్టమొదటగా జరిగే వేడుక అని చిన్నారులకు ఇది ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుందని, వారికి వారి జీవితంలో ఇది ఒక ప్రత్యేకమైన అనుభూతిగా మిగిలిపోతుందని తెలిపారు. పిల్లల వేషధారణలు, వారి సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, ఫెరోజ్, జానఖీ రాము, దివ్య, ప్రపుల, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# బడ్జెట్ అనంతరం బరిలోకి ప్రభుత్వం... గ్రామీణ రాజకీయాలకు సంకేతం

## -పల్లె ఎన్నికలపై రేవంత్ సర్కార్ దృష్టి

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440585494**

తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పరిపాలనా ప్రక్రియలు మాత్రమే కావు; అవి రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే సూచికలు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలుగా వ్యవహరిస్తూ ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రతిబింబిస్తాయి. ఈ స్థాయిలో వ్యక్తమయ్యే ప్రజా తీర్పు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుంది. అందువల్ల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రాజకీయ వర్గాల్లో సహజంగానే ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత స్థానిక సంస్థల వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ప్రభుత్వానికీ ఒక ప్రధాన కార్యసూచిగా నిలిచింది.గ్రామీణా భివృద్ధి, పథకాల వికేంద్రీకరణ, ప్రజాపాలనలో పారదర్శకత---ఇవన్నీ పరిషత్ వ్యవస్థద్వారా అమలవుతున్నాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ సంస్థలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిధుల వినియోగం, స్థానిక అవసరాల గుర్తింపు వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఈ ఎన్నికలు సాధారణ రాజకీయ ప్రక్రియల కంటే ఎక్కువ ప్రాధాన్యం సంతరించు కున్నాయి.రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు ఐదేళ్ల పదవీకాలం నిర్దేశించ బడింది. గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత. అయితే ఎన్నికల సమయ నిర్ణయంలో రాజకీయ వాతావరణం,పరిపాలనా సిద్ధత, చట్టపరమైన అంశాలు ప్రభావం చూపుతాయి.ఇప్పటికే పరిషత్ ఎన్నికల విషయంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది.ప్రస్తుతం పరిషత్ ఎన్నికల సమయంపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచిస్తున్నదన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.ప్రస్తుతం




అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చినట్లు ప్రకటిస్తోంది.రైతు సంక్షేమం,మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాలఅమలు వంటి అంశాలను ప్రజల ముందుంచి ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహం కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో స్పష్టత వచ్చిన తరువాత ఎన్నికలు నిర్వహించడం రాజకీయపరంగా అనుకూల వాతావరణాన్ని సృష్టించ వచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక అంశం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ట్రిపుల్ టెస్ట్ విధానం,సామాజిక వర్గాల జనాభా ఆధారిత డేటా వంటి అంశాలు రిజర్వేషన్ నిర్ణయంలో ప్రభావం చూపుతాయి.రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా ఎన్నికలకు వెళ్లడం చట్టపరమైన చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.అందువల్ల ప్రభుత్వం ముందుగా చట్టబద్ధ ప్రక్రియలను పూర్తి చేసి, అవసరమైన అధ్యయనాలు, కమిషన్ నివేదికలు, గణాంక ఆధారాలను సిద్ధం చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి ఒక రాజకీయ సూచికగా మారాయి. పట్టణాల్లో లభించిన మద్దతు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతవరకు ప్రతిఫలిస్తుందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. గ్రామీణ ఓటరు భావజాలం, వ్యవసాయ పరిస్థితులు,పంటల ధరలు, ఉపాధి హామీ పథకాల అమలు, సంక్షేమ పథకాల చేరువ ఇవన్నీ పరిషత్ ఎన్నికలపై ప్రభావం చూపే అంశాలు. ప్రభుత్వం ఈ అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంపై నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.

బడ్జెట్ సమావేశాల అనంతరం ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం తన ఆర్థిక ప్రాధాన్యతలను ప్రజలకు స్పష్టంగా తెలియ జేయగలదని భావిస్తోంది. బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు,సాగునీటి ప్రాజెక్టులు, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం,యువత ఉపాధి కార్యక్రమాలకు అధిక కేటాయింపులు చేస్తే అది ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. బడ్జెట్ ప్రకటనల ద్వారా సంక్షేమ హామీలను పునరుద్ఘాటించి ఎన్నికల మైదానంలోకి దిగడం రాజకీయంగా అనుకూలమని విశ్లేషకులు సూచిస్తున్నారు.సామాజిక సమీకరణ పరిషత్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా స్థానిక నాయకత్వంలో విస్తృత ప్రతినిధిత్వం కల్పించ బడుతుంది.అయితే రిజర్వేషన్ శాతం,వార్డు పునర్విభజన,జనాభా గణాంకాల ఖచ్చితత్వం వంటి అంశాలు వివాదాలకు దారితీయవచ్చు. ప్రభుత్వం ముందస్తుగా చట్టపరమైన అభ్యంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యోచిస్తోంది. రిజర్వేషన్ల ప్రకటనతోనే స్థానిక రాజకీయ సమీకరణాలు మారిపోతాయి కాబట్టి అభ్యర్థుల ఎంపికలో అన్ని పార్టీలూ జాగ్రత్తగా వ్యవహరించే అవకాశముంది.పరిషత్ ఎన్నికలు సాధారణంగా పార్టీ గుర్తులపై వాస్తవానికి రాజకీయ పార్టీల మద్దతుతో నిర్వహించ బడుతుండగా... గ్రామ స్థాయిలో పార్టీ ప్రభావాన్ని కొలిచే పరీక్షగా ఈ ఎన్నికలు భావించ బడుతున్నాయి.అధికార పార్టీకి ఇది తన పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అంచనా వేసే వేదిక.ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని సమీకరించే అవకాశం .ప్రచార వ్యూహాలు,అభ్యర్థుల ఎంపిక, కూటముల అవకాశాలు ఈ ఎన్నికల్లో కీలక అంశాలుగా మారనున్నాయి.

పరిపాలనా పరంగా కూడా ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలు. ఓటరు జాబితాల నవీకరణ,పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శక ప్రక్రియను అమలు చేయాలన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉంది. యువత, మహిళా ఓటర్ల ప్రాధాన్యతను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణిస్తోంది. గ్రామీణ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం,మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, గ్రామీణ వ్యాపారాలకు ప్రోత్సాహం---ఇవన్నీ ఎన్నికల సమయంలో ప్రధాన చర్చాంశాలుగా మారవచ్చు. సామాజిక సంక్షేమ పథకాల అమలు ప్రజల్లో ఎంతవరకు సానుకూల భావన కలిగించిందన్నది ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించే అవకాశం ఉంది. రాజకీయంగా చూస్తే పరిషత్ ఎన్నికలు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు ఒక ముందస్తు సంకేతంగా భావించ బడుతున్నాయి.గ్రామీణ ఓటరు మద్దతు ఏ దిశగా ఉందన్నది స్పష్టమవుతుంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత, బడ్జెట్ సమావేశాల అనంతర రాజకీయ వాతావరణం,పరిపాలనా సిద్ధత ఈ మూడు అంశాల సమన్వయం ఆధారంగానే తుది నిర్ణయం వెలువడే అవకాశముంది. మొత్తానికి పరిషత్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు కావచ్చని చెప్పవచ్చు.ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలో జరిగే ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే శక్తి కలిగి ఉన్నాయి.ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం,పరిపాలనా సామర్థ్యాన్ని ప్రజల ముందుంచి మద్దతు కోరుతుండగా,ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ పోటీకి సిద్ధమవుతున్నాయి.బీసీ రిజర్వేషన్లపై స్పష్టత,బడ్జెట్ ప్రకటనల ప్రభావం, గ్రామీణ వాతావరణంఈ మూడు అంశాల సమ్మేళనమే పరిషత్ ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించ నున్నది. తెలంగాణ రాజకీయాల్లో తదుపరి దశకు మార్గదర్శకంగా ఈ ఎన్నికలు నిలిచే అవకాశముంది.

## సీఐని కలిసిన పలువురు నాయకులు




**చురకలు విలేకరి,జగిత్యాల, ఫిబ్రవరి 24 :** సంత్ రవిదాస్ 660వ జయంతి ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంత్ రవిదాస్ క్యాలెండర్లను పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ కు అందజేశారు.ఈ సందర్భంగా సంచార జాతుల నాయకులకు, ప్రముఖులకు ఈ క్యాలెండర్లను అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి, భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసిఎస్ రాజు,సామాజిక సమరసతవేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొంధుకురి శ్రీనివాస్, ఇల్లందుల పురుషోత్తం,నరేందర్,అక్కిన పెల్లి కాశీనాథం పాల్గొన్నారు.

## కౌన్సిలర్ అరవ లక్ష్మికి సన్మానం



**చురకలు విలేకరి,జగిత్యాల, ఫిబ్రవరి 24 :** జగిత్యాల మున్సిపల్ 22వ వార్డు కౌన్సిలర్గా ఎన్నికైన అరవలక్ష్మి ఏసిఎస్ రాజులను మంగళవారం అన్నపూర్ణ అన్నప్రసాద సేవా సమితి సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు చకినం ప్రసాద్, మురికి వెంకట రమణ,గంప రాములు,బోనగిరి సురేష్,జగడం రచన తదితరులు పాల్గొన్నారు.

## నర్సింహులపల్లెలో ఉచిత వైద్య శిబిరం




**చురకలు విలేకరి,బీర్‌పూర్,ఫిబ్రవరి 24 :** బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో పల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల సృజన సుశిన్,వార్డు సభ్యులు,డా.ఆనంద్ కుమార్,డా. కె.సంతోష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన మున్సిపల్ ఛైర్ పర్సన్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 24 :** జగిత్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ గా ఎన్నికైన సమిండ్ల వాణి ఎం శ్రీనివాస్ మంగళవారం మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ .సంజయ్ కుమార్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని,రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందించగా సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నరసింగరావు ఉన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## -మాజీ జడ్పి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 24 :**

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జడ్పి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్గల్ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంటలు నెలకొరిగాయి. మంగళవారం దెబ్బతిన్న పంటలను మాజీ జడ్పి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్ స్థానిక నాయకులు, రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతులకు ప్రభుత్వం అండగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్ రావు, ఎల్ల రాజన్న, పూదరి శ్రీను, ముత్యం, చందు, గంగరాజం, గోపాల్,



వెంకన్న, దేవన్న, నర్సయ్య, నాగస్వామి, రాజేందర్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

# వేములవాడ ఆలయంలోని దర్గాను తొలగించడం హేయమైన చర్య

-దర్గాను తొలగించి సెక్యులర్ హిందువులు, ముస్లింల మనోభావాలను దెబ్బతీశారు
-వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా దర్గాను ఎలా కూల్చివేస్తారు
-బిజెపి, ఆర్ఎస్ఎస్ వాళ్లకంటే సెక్యులర్ ముసుగు వేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాసే ప్రమాదకరం
-ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శలు



**చురకలు ప్రతినిధి,వేములవాడ, కరీంనగర్ ఫిబ్రవరి 24 :** కాంగ్రెస్ ప్రభుత్వంలో వేములవాడ ఆలయంలోని దర్గాను వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా తొలగించడం హేయమైన చర్యఅని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్హుస్సేన్ విమర్శించారు. మంగళవారం ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు వేములవాడ లోని ప్రఖ్యాత 800 సంవత్సరాల చరిత్ర కలిగిన హజ్రత్ తాజుద్దీన్ ఖాజా బక్ష్ వార్ రహ్మతుల్లా అలైహి దర్గా ను దేవాదాయ,ధర్మాదాయ శాఖ వారు కూల్చివేశారనే సమాచారం మేరకు గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో.. ఎంఐఎం కార్పొరేటర్లు ఆతిన ఆతిఫ్, ఇబ్రహీం,మొహసీన్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్లతో కలిసి వేములవాడకు వెళ్లారు.జరిగినటువంటి యావత్ అంశాన్ని బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి ఫోన్లో వివరించినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్తో ఫోన్ లో మాట్లాడారు.దర్గాను కూల్చివేయ లేదని,రెనోవేషన్ కోసం గోడలను మాత్రమే తొలగించామని, ఎమ్మెల్యే అబద్ధం చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో ఉన్నానని, రేపు లేదా ఎల్లుండి క్షేత్ర స్థాయిలో వెళ్లి దర్గాను పరిశీలిద్దామని, గుడి రెనోవేషన్ పనులు జరుగుతుండటంతో గుడి పరిసరాల్లోకి ఎవరిని అనుమతించడం లేదని,తాను వచ్చాక,జిల్లా అధికారులతో కలిసి పరిశీలన చేద్దామని ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారని తెలిపారు.ఈ అంశంపై తాను వక్ఫ్ బోర్డు చైర్మన్తో మాట్లాడానని వక్ఫ్ బోర్డు చైర్మన్ అహ్మతుల్లా హుస్సేని దర్గా కూల్చివేసిన అంశం వక్ఫ్ బోర్డుకు సమాచారం లేకుండానే చేశారని చెప్పారన్నారు. ముతవల్లి ఇఫ్తేఖార్ హుస్సేన్ నిర్వాకం వల్లనే ఈ ఘటన జరిగిందన్నారు. ముతవల్లి షిప్ నుంచి తొలగిస్తామని,చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చైర్మన్ చెప్పారని పేర్కొన్నారు.ఏది ఏమైనప్పటికీ వక్ఫ్ చట్టం ప్రకారం 800 సంవత్సరాల చరిత్ర కలిగిన దర్గాను అక్కడి నుంచి కూల్చివేసిన తొలగించాలని కుట్రలు చేసిన అది చట్ట ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని,పురాతనమైన దర్గాను గనుక తొలగిస్తే సెక్యులర్ హిందువులు,ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తే భక్తుల ఆగ్రహానికి గురవుతారని చెప్పారు.దర్గా మూతవల్లి ఇఫ్తే కార్ హుస్సేన్ డబ్బులకు అమ్ముడుపోయి దర్గాను తొలగించాలని, ఎన్ఓసి ఇచ్చినట్లు ప్రాథమికంగా సమాచారం స్థానికుల నుంచి తమకు వచ్చిందన్నారు.అది దర్గా కాదు చిల్లా ముబారక్ అని ఎన్ఓసి ఇచ్చినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుందని, దర్గా ముతవల్లి తన ఈమాన్ విశ్వాసాన్ని అమ్ముకొని ఈ లెటర్ ఎమ్మెల్యేకు,ఎండోమెంట్ శాఖకు ఇచ్చాడని, ఇచ్చినటువంటి ఎన్ఓసీని చూపెట్టాలని దర్గా ముతవల్లిని తాము కోరగా..వచ్చి చూపెడతానని ముతవల్లి ఇఫ్తేఖార్ ఫోన్ స్విచ్ఆఫ్ చేసుకున్నాడని ,ఎప్పటికైనా ఇఫ్తే ఖార్ హుస్సేన్ కు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దర్గా సంరక్షణ బాధ్యతలు చేపట్టే ముతవల్లికి ఎన్ఓసి ఇచ్చే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు.వక్ఫ్ బోర్డు స్పందించి తక్షణమే దర్గా ముతవల్లి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తేదీ:-17.10.2025 రోజున ఫైల్ నెంబర్ 11508/పీఆర్వోటి/కెఎం ఎన్ఆర్/2008/సప్లై ద్వారా వక్ఫ్ బోర్డు సీఈవో రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కు సర్క్యులర్ నోటీసును పంపించారన్నారు. దర్గాకు సంబంధించి వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా ఎలాంటి రెనోవేషన్ చేయడం,కూల్చివేయడం,ఎవరికి లీజుకు ఇవ్వడం వంటివి చేయకూడదని సర్క్యులర్ నోటీసులో స్పష్టంగా ఉందన్నారు.ఎమ్మెల్యే ఇలా అసత్యాలు చెప్పడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతుందన్నారు. ఎన్నికల్లో సెక్యులర్ వాదులుగా వచ్చి ముస్లింల,సెక్యులర్ వాదుల ఓట్లు దండుకొని,చారిత్రక మతపరమైన కట్టడాలను,ఇష్టారాజ్యంగా ఎలా కూల్చి వేస్తారని ప్రశ్నించారు.ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ నిర్మాణ పనులు జరుగుతుండగా,ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా దర్గా ఎలా కూలుతుందని విమర్శించారు.పవిత్ర రంజాన్ మాసంలో దర్గాలను కూల్చివేయడం, ముస్లింల మనోభావాలు దెబ్బతీయడం వంటి ఘటనలు చూస్తుంటే,అసలు ఆది శ్రీనివాస్ కాంగ్రెసా లేక ఆర్ఎస్ఎస్సా అర్థం కావడం లేదన్నారు.వేములవాడ లో ప్రజాస్వామ్యం ఉందా లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు.సంఘ్ పరివార్, బిజెపి నేతలకంటే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రమాదకరమైన వ్యక్తి అని అర్థమవుతుందన్నారు.తొలగించిన స్థానంలో దర్గాను పునర్ నిర్మాణం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

# ఘనంగా విలేఖరి అనిల్కుమార్ దంపతుల మ్యారేజ్ డే వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 24 :** ఎల్లారెడ్డిపేట మండల వి6 వెలుగు విలేఖరి శ్యామంతుల అనిల్కుమార్ సాధన (శిరీష) దంపతుల మ్యారేజ్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.నిండునూరేళ్ళు సుఖ సంతోషాలో చిలుకా గోరింకల్లా జీవించాలని సుఖ సంతోషాలో జర్నలిస్టులు ఆకాంక్షించారు, దంపతులు ఇరువురికి మ్యారేజ్ డే శుభాకాంక్షలు తెలిపారు.మ్యారేజ్ డే వేడుకల్లో సీనియర్ జర్నలిస్టు బండారి బాల్రెడ్డి,కోండ్లేపు జగదీష్,కందుకూరి రవి,శ్రీ రామోజీ శేఖర్,కట్టెల బాబు,శ్రీ రామోజీ ప్రవీణ్, గుర్రాల చంద్రమోహన్ రెడ్డి, పందిర్ల రవికాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్ట్కు జెడ్పిహెచ్ఎస్ ఎల్లారెడ్డిపేట విద్యార్థి ఎంపిక



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి లో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్పిఎస్టి) నిర్వహించిన టాలెంట్ టెస్ట్లో రెండవ స్థానం సాధించి,రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్కు ఎంపికైన ఏస్ కె.ఆల్వియా 9ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహరాచారి, ఉపాధ్యాయులు గరుగుల స్వామి,సాతు శైలజ,ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, దరిపెల్లి శ్రీనివాస్,ఎండి.ఇబ్రహీం,చిట్టి శ్రీకాంత్,స్తంభంపెల్లి శ్రీనివాస్ గార్లు శుభాకాంక్షలు తెలిపి,విద్యార్థిని అభినందించారు.

# నిత్యవసర సరుకులు,బియ్యం అందజేసిన తహసిల్దార్

-బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
-బాధితునికి కేకే మహేందర్ రెడ్డి తరపున పదివేల నగదు ఆర్థిక సాయం అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో హైవోల్టేజ్తో ఆటో డ్రైవర్ బెస్త మల్లేశంకు చెందిన ఇళ్ళు టీవీ విద్యుత్ వైర్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో తదితర సామాన్లు ఖాళీ బూడిద అయ్యాయి అదేవిధంగా గ్రామంలో మరో 12 ఇండ్లల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో విద్యుత్ మీటర్లు కాలిపోయి ఆర్థికంగా నష్టపోయారు.ఈ విషయం తెలుసుకొని మంగళవారం ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ సుజాత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బెస్త మల్లేశం ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.తహసిల్దార్ సుజాత నిత్యవసర సరుకులతో పాటు25 కిలోల బియ్యాన్ని బాధితుడు బెస్త మల్లేశంకు అందజేశారు.అదేవిధంగా సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి చెరవాణిలో బాధితుడు మల్లేశంతో మాట్లాడి ఓదార్పారు మనోధైర్యాన్ని కల్పించారు.కాంగ్రెస్ పార్టీ తరఫున 10వేల రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి అందజేశారు ,హైవోల్టేజీ వల్ల మల్లేశం కుటుంబం రోడ్డున పడ్డారని వీరిని వెంటనే సెస్ అధికారులు సంబంధిత అధికారులు పట్టించుకోని వీరి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని జిల్లా సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీస్ చైర్మన్ మొహమ్మద్ లాలా డిమాండ్ చేశారు, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అందె సుభాష్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,ఉప సర్పంచ్ జెజ్జరి దేవేందర్ ముదిరాజ్ దండు శ్రీనివాస్ ముదిరాజ్, గ్రామశాఖ అధ్యక్షులు సత్యనారాయణ, ఏఎం సి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 24 :** పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలలకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, రొంపి కుంట సర్పంచ్ గుమ్మడి (హెల్పర్) శ్రీనివాస్ సిద్ది పల్లె సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ అన్నారు. శీను బాబు పుట్టినరోజు సందర్భంగా రొంపిగుంట పాఠశాలలో 74 మంది జూలపల్లి పాఠశాలలో 24 మంది కమాన్ పూర్ పాఠశాలలో 64 మంది పదో తరగతి విద్యను అభ్యసించుచున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా ప్యాడులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో మంచిర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అభివృద్ధి చేస్తుందని అలాగే మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గంలో మరియు పాఠశాలకు వంట గదిలో ప్రహరీ గోడలు నిర్మాణానికి నిధులను కేటాయించడం జరుగుతుందని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అంబిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పంజా సాయి రామ్ గౌడ్, రవీందర్, కటకం నారాయణ, బొల్లెపల్లి శంకర్ గౌడ్ ,సేవా శంకరయ్య , కిషన్ రెడ్డి,కమాన్ ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్,జూలపల్లి ఉపసర్పంచ్ ఉపసర్పంచ్ రాజ మహేందర్, ఏఎంసీ డైరెక్టర్ రఫిక్,రెబల్ రాజు, గుమ్మడి సతీష్, మల్యాల మహేష్, లల్లు, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి మారుపేరు 'దుద్దిళ్ళ' సోదరులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పాలకుర్తి) ఫిబ్రవరి 24 :** మంథని నియోజకవర్గ నికి అభివృద్ధికి మారుపేరు దుద్దిళ్ల సోదరులు అని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరంలాగే డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో కన్నాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు పంపిణీ చేసి, వారి విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

**సూర సమ్మయ్యగ మాట్లాడుతూ** "నాయకత్వం అంటే పదవులు కాదు, ప్రజాసేవ. విద్యార్థుల అభివృద్ధే నిజమైన అభివృద్ధి. దుద్దిళ్ల శ్రీను బాబు సేవాస్ఫూర్తి ఆదర్శంగా తీసుకుని సమాజానికి అంకితభావంతో పని చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులు, స్కూల్ హెడ్ మాస్టర్ కమలాకర్ , రఘునందన్ రావు, భూక్య నాయక్ తండా సర్పంచ్ అఖిల అంజి నాయక్, మాజి ఉప సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్, మాజి ఎంపీటీసీ దేవి లక్ష్మి నర్సయ్య, పెద్దపల్లి జిల్లా జాయింట్ సెక్రటరీ గౌస్య, మండలం యూత్ వైస్ ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అరుకల సతీష్, సింగల్ విండో డైరెక్టర్ సక్లల్, రానాపూర్ వార్డ్ సభ్యులు, ఉమ్మడి కన్నల మాజి వార్డ్ సభ్యులు సురేష్, సాగర్ గౌడ్, దండుగుల రమేష్, తువ్వా సతీష్, లక్ష్మణ్ రావు, ముంజ రాజు, ఆరిఫ్ పాషా మరియు యువకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం



**చురకలు ప్రతినిధి, కరీంనగర్ ఫిబ్రవరి 24 :** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లందరికీ భారీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని సీపీ గౌష్ ఆలం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. దృష్టి లోపం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడానికి మరియు డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణ కోసం ఈ ఉచిత పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను మంగళవారంనాడు సీపీ, పోలీసు కమీషనర్ కార్యాలయంలో ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ఆలం, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైవర్ల భద్రతకు తమ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. "అరైవ్ అలైవ్" చొరవతో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు."సురక్షిత ప్రయాణానికి స్పష్టమైన కంటి చూపు చాలా ముఖ్యం. ప్రైవేట్ వాహనాలు, టిజిఆర్టిసి, ఆటోలు మరియు భారీ వాహనాల డ్రైవర్లందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని వినియోగించు కోవాలని కోరుతున్నామన్నారు."

**కార్యక్రమ వివరాలు:**

**కార్యక్రమం:** డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం

**తేదీ:** ఫిబ్రవరి 27, 2026

**వేదిక:** అస్త్ర కన్వెన్షన్ హాల్, కరీంనగర్ పోలీసు హెడ్ క్వార్టర్స్.

**నిర్వాహకులు:** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్

కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని డ్రైవర్లందరూ ఫిబ్రవరి 27న అస్త్ర కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని, నిపుణులైన వైద్యులచే కంటిపరీక్షలు చేయించు కోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ఏసీపీ లు వెంకటస్వామి, విజయకుమార్, శ్రీనివాస్, శ్రీనివాస జి, రమేష్, సతీష్ , రమేష్, ఇన్స్పెక్టర్లు రామ్ చందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 24 :** కమాన్ పూర్ మండలం రొంపి కుంట గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్య రొంపి కుంట అంబేద్కర్ సంఘ నాయకులకు అంబేద్కర్ విగ్రహాన్ని అందజేశారు. రొంపి కుంట గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటుకు పలువురు అంబేద్కర్ సంఘ నాయకులు కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్యను అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరగా ఆయన తన వంతుగా అంబేద్కర్ విగ్రహాన్ని కొని ఇస్తానని హామీ ఇచ్చి అంబేద్కర్ సంఘ నాయకులకు అందజేశారు. త్వరలో ప్రతిష్టాపన చేయనున్న అంబేద్కర్ విగ్రహాన్ని ప్రముఖ సింగరేణి కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్య 60వేల రూపాయలతో కొనుగోలు చేసి అంబేద్కర్ సంఘ నాయకులకు అందజేశారు. అంబేద్కర్ విగ్రహా అందజేసిన అంజయ్యకు అంబేద్కర్ సంఘం నాయకులు కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గౌర అధ్యక్షుడు పులిపాక మొండయ్య, అధ్యక్షుడు పులిపాక శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గొట్టే నరసయ్య, ఉపాధ్యక్షుడు పులిపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూలపల్లి గ్రామాన్ని

# అన్ని విధాల అభివృద్ధి చేస్తా



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 24 :** జూలపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా అని గ్రామ సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్ అన్నారు. మంగళవారం కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో 9వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో మురికి కాలువ నిర్మాణానికి సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్ ఉపసర్పంచ్ గడ్డం రాజ మహేందర్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. మిగిలిపోయిన సమస్యలను పరిష్కారమే మార్గంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు బొల్లంపల్లి సంతోష్ కుమార్ సాగర్ల రమా మహేష్ ఇరుగు రాళ్ల రాజు గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# కన్నాలలో శీనుబాబు పుట్టినరోజు వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ 24 :** మంథని మండలం కన్నాల గ్రామంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరులు నాయకులు యువనేత తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు జన్మదినం పురస్కరించుకొని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం కన్నాల గ్రామంలో శీనుబాబు ఆయురారోగ్యాల తో వర్ధిల్లాలని రాజకీయంలో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరుకుంటూ పూజా కార్యక్రమాలు అర్చన నిర్వహించడం జరిగింది. అనంతరం కన్నాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఏఎంసి వైస్ చైర్మన్ ముసుకుల ప్రశాంత్ రెడ్డి మండల అధికార ప్రతినిధి తోకల మల్లేష్ సీనియర్ నాయకులు కావటి సందీప్ ముస్కుల రమేష్ రెడ్డి జగ్గారెడ్డి యాదవ సంఘం మాజీ అధ్యక్షులుకావటి సమ్మయ్య యాదవ్ కిసాన్ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు పెరటి పాపిరెడ్డి వార్డు సభ్యులు రామగిరి సంపత్ పర్శవేన అనిల్ నాయకులు కొండా లచ్చయ్య గౌడ్ ముసుగుల నారాయణరెడ్డి నాంపల్లి వెంకటి పరుష వేన సంతోష్ నాంపల్లి రంజిత్ నాంపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 24 :** సిద్దిపల్లి గ్రామాన్ని చెత్తరహిత గ్రామాన్నిగా తీర్చిదిద్దుదామని సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలం సిద్ది పల్లె గ్రామంలో మురికి కాల్వలో వేరుకపోయిన చెత్తాచెదారాలను ప్రైవేట్ సిబ్బందిచే తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని మురికి కాల్వలో వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో వేయాలని ఆమె అన్నారు. తమ తమ ఇండ్లలోని చెత్త మురికి కాలువలో వేస్తే అది మురిగి వాసన లేస్తుందని దాన్ని పెట్టుకొని గ్రామపంచాయతీ ట్రాలీలో వేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, ఏడో వాడు సభ్యుడు మాడిశెట్టి రమేష్, గ్రామ కార్యదర్శి జెంజర్ల అమల తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పిసిని అభినందించిన ఎస్సై



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 24 :** కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కూరపాటి శ్రీలతను ఎస్సై కొట్టే ప్రసాద్ అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో సైబర్ బాత్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో యోగాలో సింగిల్ లో ఆర్టిస్ట్ కె బంగారు పతకం సాధించారు. యోగా ట్రెడిషనల్ లో కాంస్య పతకాన్ని సాధించారు. దీంతో ఆమెను సోమవారం పోలీస్ కమిషనర్ లో సన్మానం చేశారు. అలాగే మంగళవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్లో అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాహ్నవి శ్రీనాథ్, అంజలి పాల్గొన్నారు. రెండు పథకాలు సాధించిన శ్రీలతను ఏఎస్ఐలు రహీం భూక్య బాలాజీ ఖలీల్‌ఖాన్ హెడ్ కానిస్టేబుల్ బాపన్న సిబ్బంది మల్లన్న, అశోక్, జంగిలి రమేష్, శ్రీనివాస్, రమీజ్ తదితరులు అభినందించారు.

# పరిస్థితుల ప్రభావంతోనే మావోయిస్టుల లొంగుబాటు

## -మాజీ నక్సలైట్ ఎరుకల రాజయ్య



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 24 :** భారతదేశంలో ఉన్న పరిస్థితులతోనే కేంద్ర రాష్ట్ర కమిటీల మావోయిస్టు నాయకులు లొంగి పోతున్నారు.అని ఉమ్మడి కమాన్ పూర్ మండలం రానాపూర్ గ్రామానికి చెందిన దేవన్న ఏఎరుకల రాజయ్య పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన ప్రజా క్రాంతి ఒక ప్రకటన విడుదల చేశారు.సంవత్సరం కాలం నుంచి భారతదేశంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లొంగుబాటు మార్గం ఎంచుకున్నాడు కారణం ఏమిటి అంటే భారతదేశంలో పరిస్థితులు మారుతు న్నాయి అందుకని సాయుధ పోరాట విరమణ చేయాలని నిర్ణయించుకున్నాం అనివాళ్లు ప్రకటనలు వీడియోలు చేస్తున్నారు అని పేర్కొన్నారు.ఒకసారి మారుతున్న పరిస్థితులను పరిశీలిద్దాం వివరాలను తెలియజేశారు.కామ్రేడ్స్ మిత్రులారా దేశంలో ప్రపంచంలో 1991నుంచి పరిస్థితులు మారుతు న్నాయి మారుతున్న పరిస్థితులు వాస్తవమే ఈ మారుతున్న పరిస్థితులు అందరికీ తెలిసినవే కొత్తగా సోను ఆశన్న జంపన్న కనిపెట్టింది ఏమీ లేదు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అని స్పష్టం చేశారు.తెలుగు రాష్ట్రాలలో వ్యవసాయ రంగంలో విద్యా రంగాలలో అనేకమైన మౌలిక రంగాల లో మార్పులు చోటు చేసుకున్నాయి, పరిస్థితులకు అనుకూలంగా తీర్మానాలు అన్ని చేసుకున్నప్పటికీ సంబంధిత కమిటీలో పని విధానంలో నిర్లక్ష్యం మూలంగా పనులు జరగకపోవడం మూలంగానే పార్టీకి రోజు ఈ స్థితి వచ్చింది అని పేర్కొన్నారు.దీనికి అంతటి కారణం కేంద్ర కమిటీ సభ్యులు బాధ్యత వహించి ఉంటే పరిస్థితి మరోలాగా ఉండేది అని తెలిపారు. ప్రస్తుతం మధ్య భారతం ఏరియాలో సైన్యం భారత సైన్యం పెద్ద ఎత్తున క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు కాబట్టే అందుకే ఎక్కడ ఉంటే చనిపోతాం కాబట్టి మేము అంటే సోన్ ఆశన్న చెప్తున్నా మాటలు భారత సైన్యం మధ్య భారత్ ఏరియాలో ఎప్పుడు రాదు అనుకున్నారా?ఒకవేళ సైన్యం ఉద్యమ ప్రాంతాలను భేష్ ను చుట్టుముట్టి వేస్తే ఏం చేద్దాం అనే కనీసం సోయి లేదా సోను ఆశన్నకు? ప్రభుత్వం యుద్ధ సామాగ్రి ఎప్పటికీ ఎల్లవేళ ఇవాళ రేపు విప్లవ పార్టీల కంటే వంద రెట్లు ఎక్కువ ఉంటుంది ఈ విషయం తెలియదా? తెలిసినా నటిస్తున్నారా?10 - 15 సంవత్సరాలు జనతన సర్కార్ నడిపినాము అని చెప్తున్నా సోను. ఈ 15 ఏళ్ల కాలం యుద్ధం గురించి సలహాలు చేయడంలో సోను విఫలమయ్యారు పెద్ద ఎత్తున అందరు చనిపోతున్నారు కాపాడుకుందాం లొంగిపోడి అని రోజు అరుస్తున్న సోను సైన్యం విప్లవ ప్రాంతాలపై దాడులు జరిగినప్పుడు విప్లవకారులు చనిపోవడం సహజమే అని సోనుకు తెలువదా? విప్లవం విందు భోజనం కాదు అది మీకు తెలుసు అని స్పష్టం చేశారు. భారతదేశంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఫాసిజం విధానాన్ని తీవ్రంగా అమలు చేస్తుంది.మళ్లీ రాజ్యాంగ పరిధిలో హక్కుల గురించి మాట్లాడిన మరుక్షణమే కేంద్ర ప్రభుత్వం మిమ్ములను వెంటనే అండమాన్ జైల్లో పెట్టారు ఆ విషయం నీకు తెలుసు అందుకే భారత ప్రజల ఆదివాసుల హక్కులు కోసం నీవు మాట్లాడలేక పోతున్నావు అందుకే నీవు ఆశన్న కేంద్ర ప్రభుత్వం కంట్రోల్లో బ్రతుకుతూ మావోయిస్టు పార్టీ మెజార్టీ సభ్యులను.సరెండర్ చేయించడం కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నావు అని తెలిపారు.మరో విప్లవం కోసమా అసలు విప్లవకారులను పూర్తిగా నాశనం చేయడం కోసమా?ప్రాణాలకు తెగించి పోరాడుతున్న మావోయిస్టులను లొంగిపోడి అని చెప్పడానికి మీరెవరు?కొంతకాలం నీ మాటలు నమ్మి కొద్దిమంది సరెండర్ కావచ్చు దేశంలో విపరీతమైన నిరుద్యోగం కుప్పలు తిప్పలుగా యువతరం రాజ్యంపై కసితో రగిలి పోతున్నారు ఉద్యమం మళ్లీ ఆరంభమైతే మీలాంటి నక్కలు ఎన్ని కూతలు కూషిన విప్లవ వలయాన్ని మీరు ఆపలేరు.బిజెపి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని లేకుండా చేస్తానని చెప్తున్నారు ఇంకా రాజ్యాంగ పరిధిలో హక్కుల పరిరక్షణ కోసం కొత్త పార్టీలు అని మాట్లాడడం పిచ్చివాళ్ళ మాటల మాదిరిగా ఉంటుంది ప్రపంచంలో వర్గ పోరాటాల సిద్ధాంతాన్ని రచించిన మేధావులు మరణించిన కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి.ఎక్కడ ఆగడం లేదు ,కామ్రేడ్ చార్ మజుందార్.అమరుడు కావడం జరిగింది.ఉద్యమాలు ఆగలేదు ,కొండపల్లి సత్యమూర్తి పార్టీ నుండి బయటకి వెళ్లిపోయారు ఉద్యమం ఆగలేదు శ్రీకాకుళంలో మొత్తం నాయకత్వం అమరులయ్యారు ఉద్యమం ఆగలేదు ఎందుకంటే ఉద్యమ నాయకులు చనిపోయిన కూడా లేదా ఉద్యమ నాయకులు దిగజారి పోయినా కూడా ఇక్కడ ప్రజల సమస్యలు జన్మదిన ప్రజల సమస్యలు కుల సమస్య విద్య వైద్యం భూమి సమస్య ఆత్మగౌరం అనేక సమస్యలతో ఈ దేశంలో ప్రజలు పీడించ పడుతున్నారు పడుతున్నారు అందుకే ప్రజలు మళ్లీ మళ్లీ పోరాడుతున్నారు పోరాటాలను కోరుకుంటున్నారు.ఈ దేశంలో కాశ్మీర్ సమస్య పరిష్కారం కాలేదు ఈ దేశంలో జాతుల సమస్యలు పరిష్కారం కాలేదు, భారతదేశంలో ముస్లింల సమస్య పరిష్కారానికి అది నోచుకోలేదు ఇప్పటికి భారతదేశంలో అతిసూద్రులు మనుషులుగా జీవించే పరిస్థితి లేదు అందుకే ప్రజలు విప్లవాన్ని కోరుకుంటు న్నారు అందుకే ప్రజలు శ్రామిక వర్గ నాయకత్వాన్ని కాపాడుకుంటున్నారు అని తెలిపారు.ఎంతమంది లొంగి పోయిన ఎంతమంది అమరులైన ఈ భారతదేశంలో రేపు కోట్ల మంది విప్లవకారులను మళ్లీ మళ్లీ తయారు చేసుకుంటారు ఎంతటి వాడైనా లొంగిపోయిన వారి మాటలు చెల్లవు విప్లవాలు అంతరించి పోవు !!

## బసంత్ నగర్‌లో
# శీనుబాబు జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 24 :** పాలకుర్తి మండలం బసంత్ నగర్ లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిల్ల శీనుబాబు పుట్టినరోజు వేడుకలను అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు తమ్ముడు దుద్దిల్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలను అల్ట్రా టెక్ సిమెంట్ ఫ్యాక్టరీ పర్మనెంట్ యూనియన్ అధ్యక్షులు బయ్యపు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి మిఠాయి పంపిణీ చేశారు శ్రీను బాబు జెన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది .కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ పాలకుర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పర్యవేణి శ్రీనివాస్ ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ రాజకుమార్ మేకల గంగమ్మ కొత్తపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు అమ్ముల కుమార్ ఆటో యూనియన్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీను బాబు గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది.

## అంజన్న ఆలయ అభివృద్ధి పనులకు
# మంత్రి అడ్లూరికి వినతిపత్రం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం శ్రీ భక్తాంజనేయ ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం, అన్నప్రసాద వితరణకు రెండు షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు సమకూ ర్చాలని కోరుతూఆలయచైర్మన్ మేరుగు నరేష్ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ కు గ్రామస్థుల తో కలిసి ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఆలయంలో మౌళిక సదుపాయాల కోసం సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాను కూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగుమురళి, జిల్లా కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు, అశోక్, నరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్లతో వెళ్లి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను కలిసిన వెలిచాల






**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 24 :** ఇటీవల నూతనంగా ఎన్నికైన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులతో వెళ్లి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను కరీంనగర్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పూల మొక్కలను అందించారు.అనంతరం పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సిపితో రాజేందర్ రావు చర్చించారు.రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారని ఇంకా మరింత ప్రగతి పథంలో పరుగులు పెట్టేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి రాజేందర్రావు తీసుకొచ్చారు.కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతలు బేష్ గా ఉన్నాయని సిపి గౌష్ఆలం కృషి ఎంతో ఉందని రాజేందర్రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు,కాంటెస్టెడ్ అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో పరిశీలించిన అదనపు కలెక్టర్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 24 :** ఈ నెల 25 వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు.సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సహస్ర జూనియర్ కళాశాల, సాయిశ్రీ జూనియర్ కళాశాల అలాగే తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఆర్జేసీ కళాశాలలో చేసిన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4046, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4060 పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు.పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చేనెల (మార్చి 16వ తేదీ)దాకా నిర్వహించనున్నారని, ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టనున్నారని తెలిపారు.పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు.పరిశీలనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్ కుమార్, తంగళ్ళపల్లి మండలం తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు,తదితరులు ఉన్నారు.



# ఆడబిడ్డల కళ్యాణంతో తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందం వెల్లువిరియాలి

**-ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**
**-ప్రజలు గత పాలకులను విస్మసించారు**
**-అభివృద్ధిలో దేశం మెచ్చే స్థాయిలో తెలంగాణ**
**-పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 24 :** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో మంగళవారం రోజున సుల్తానాబాద్ మున్సిపల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 99మంది లబ్ధిదారులకు ?99,11, 484/-(తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల నాలుగువందల ఎనబై నాలుగు రూపాయలు) విలువ గల కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతుందని గత పాలకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందించిన పాపాన పోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో మంత్రి శ్రీధర్ బాబు సారధ్యంలో 333 రేషన్ కార్డులను అందించామని 824 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని నూతనంగా నమోదైన వారు 34 52 కుటుంబాలు కాగా 47 64 నమోద యాయని తెలిపారు.మండలంలో కొత్తగా రేషన్ కార్డులు 22 152 అందించామన్నారు. పూర్తిగా కుటుంబ సభ్యుల సంఖ్య 63 836 ఉన్నారని తెలిపారు.మండలంలో ప్రతినెల 357 856 క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు.రానున్న రోజుల్లో హామీ ఇచ్చిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేస్తామని అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తూ ప్రతి పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాలు అధికారంలో ఉండి సుల్తానాబాద్ మండలాన్ని బ్రష్టు పట్టించిందని ఇక్కడ ఉన్న ప్రతి కార్యాలయాన్ని తరలించి ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిన చరిత్ర గత పాలకులదని అన్నారు. . అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్విరామంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని దానికి నిదర్శనమే గ్రామాలలో జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి 70% సర్పంచ్ అభ్యర్థులు ఘనవిజయం అందించారని హైదరాబాదులో జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ 26 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించింది అన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ లో 80%కాంగ్రెస్ అభ్యర్థులే విజయకేతనం ఎగుర వేశారన్నారు.సంక్షేమ పథకాలలో ముందున్నామని మహిళలకు ఫ్రీ బస్సు, రైతులకు సన్న వడ్లకు బోనసు, రైతు బీమా, రైతు భరోసా అందిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు తోపాటు ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు పోతున్నామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిపథంలో పయనించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సుల్తానా బాద్ మున్సిపల్ లో 21 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం త్వరలోనే చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే విధంగా పాలన కొనసాగుతుందని రైతులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు.గత పాలకులను విస్మర్శించి కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత,మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, తాసిల్దార్ బషీరుద్దీన్,కాంగ్రెస్ నాయకులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, మరియు పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు లబ్ధిదారులు పలువురు పాల్గొన్నారు.

## కవ్వంపల్లిను కలిసిన గునుకుల


# కొండాపూర్ జి,పి పాలకవర్గం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్, ఫిబ్రవరి, 24 :** మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారా యణని మంగళవారం రోజున నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గునుకుల కొండాపూర్ గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ,పాలకవర్గం సభ్యులుకలిసి గ్రామ అభివృద్ధి కోసం నిధులు కావాలని వినతి పత్రం సమర్పించారు.గ్రామపంచాయతీ భవనం,సిసి రోడ్లు,రజక కమ్యూనిటీ హాల్,జిమ్ సెంటర్ ,క్రీడా ప్రాంగణం తదితర అంశములపై ఎమ్మెల్యేతో చర్చించారు.ఎమ్మెల్యే తప్పకుండా గ్రామ అభివృద్ధికి తగిన సహకారం అందిస్తా నని ఈ మేరకు హామీ ఇచ్చారు.ఎస్సీ కాలనీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామ అభివృద్ధి కోసం తగిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకి గ్రామ ప్రజల పక్షాన పాలకవర్గ సభ్యుల పక్షాన సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ ధన్య వాదాలు తెలియజేశారు.

# ఆదరణ కరువైన అపురూప దేవాలయం

**-ఫిబ్రవరి 27నుండి మార్చి 11వరకు**
**లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా**



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

భారతీయ ప్రాచీన సంస్కృతికి, హైందవ సనా తన సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచి, ప్రధానంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రైమూర్త్య నిలయమై, వరదాయినియై, భక్తి ముక్తి ప్రదాయినియై, పరమ పావనియైన పవిత్ర గోదావరినదీ తీరాన వెలసి, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకుని, హిందూ ముస్లిం మత సామరస్యానికి అనాదిగా ప్రతీకగా, దక్షిణ కాశిగా, హరి హర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా రాష్ట్రంలో వాసికెక్కి, నిత్య భక్త జన సందడితో, నిరంతర దైవనామ స్మరణలతో విరాజిల్లుతున్న పవిత్ర తీర్థం - ప్రాచీన ధర్మపురి పుణ్య క్షేత్రం. రాష్ట్రంలోనే గాక, వేరెచ్చటనూ లేని విధంగా,ఈక్షేత్రంలో గల దేవాలయాలు, ఒక్కొక్కటి ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రత్యేకతను,వైశిష్ట్యాన్ని కలిగియుండడం విశేషం.అలాంటి ఆలయాలలో అత్యంత వైశిష్ట్యాన్ని సంతరించుకుని, పౌరాణిక, చారిత్రక నేపథ్యాన్ని కలిగిన పతివ్రతా శిరోమణి అయిన సత్యవతీ దేవి ఆలయం, ఆ సాధ్వీమణి పాతివ్రత్యానికి నిలువెత్తు సాక్షిభూతంగా నిలిచిన సైకత (ఇసుక) స్థంభం,దేశంలో వేరెక్కడా లేని విధంగా శివపానవట్టం మీద నారసింహ విగ్రహం కలిగి శివకేశ వాద్వైత సాంప్రదాయానికి ప్రతీకయైన ఆరుదైన విగ్రహాలు నిరాదరణ నీడలో మగ్గుతున్నాయి. ఒకనాడు మహోజ్వలం గా వెలుగొంది సనాతన హిందూ స్త్రీల ధర్మాచరణ సాంప్రదాయంలో భాగంగా, నారీ లోకానికి ఆదర్శమూర్తిగా నిత్య పూజలనందుకున్న సత్యవతీ దేవి ఆదరణ కరువై,నిర్లక్ష్యానికి గురవు తున్నది.వేదవ్యాస విరచితంగా భావించబడే బ్రహ్మాండ,స్కాందాది పురాణాంతర్గతమైన ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో సత్యవతీదేవి పాతివ్రత్య వృత్తాంతం వర్ణించ బడింది. నైమిశారణ్యంలో,శౌనకాది మహర్షులకు, సూత పౌరాణికుడు వివరించిన ప్రకారం ,నారద మహర్షి పృథు చక్రవర్తికి చెప్పిన విధంగా, పూర్వము సిందు దేశమును పాలించిన వీరసేనుడను రాజు ఆజ్ఞ ప్రకారం జయుడను ఆయన పురోహితుడు,యుక్త వయస్కు రాలైన రాకుమారికి, సర్వలక్షణ సమన్వితుడైన రాకుమారుని వరునిగా చేయ సంకల్పించి,ఎన్నో దేశాలు తిరిగి చిత్ర పటములు తెచ్చినా, ఆమె మెచ్చుకుండిన కారణంగా విసుగుచెంది,మంత్రో పాయము చేత ఒక సర్పమును బంధించి తెచ్చి, పేటిక యందుంచి, కులాచార ప్రకారం, వరుని చూడకయే యుక్త సమయమున వివాహ మాడమని చెప్పి, దేశము వదలి వెడలి పోయెను. వివాహ ముహూర్త సమయంలో పేటిక తెరచి, భయంకర సర్పమును గాంచి, జరిగిన మోసమును గ్రహించి, వచన బద్ధురాలై, రాకుమారి పామునే తన భర్తగా స్వీకరించెను. ఆ సర్పమును కంఠమున ఉత్తరీయము వలె ధరించి, భగవదనుగ్ర హామునకై తీర్థయాత్రల కేగి, పుణ్య క్షేత్రములను తిరుగుతూ, దండకారణ్య మందలి పుణ్యభూమి యగు ధర్మపురికి ఏతెంచి, పవిత్ర గౌతమీ జలా లలో సర్పముతో కూడి స్నానమాచరించెను. తక్షణమే సర్పము దివ్య పురుషునిగా మారెను. ప్రజలందరి సంశయమును తీర్చి, పాతివ్రత్య నిరూపణకై మూడు ముష్టుల ఇసుకను పిడికిలితో పోయగా, ఆ ప్రదేశమందు సైకతము ఇసుక స్థంభముగా మారెను. రాజకుమారి విజయ సత్యవతి యని పాతివ్రత్య మహిమ కారణంగా సార్థక నామధేయురాలు కాగా, ఆ మహాసాధ్వి స్నాన మాచరించిన స్థలము సత్యవతీ కుండము అని నామాంకితయ య్యెను. అనంతర కాలంలో,సత్యవతీ కుండము లో స్నాన మాచరించి, ఆమె దర్శనం చేసుకుని,స్థానిక ఇలవేలుపైన శ్రీనృసింహుని మందిరానికి వెళితే, ఒక్కొక్క పాదమున ఒక్కొక్క అశ్వమేధ యజ్ఞ ఫలం లభించునట్లు వరములు పొందెనని స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక చారిత్రిక అంశానికొస్తే స్థానిక ఓరియంటల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు, చారిత్రక పరిశోధకులు, బహుభాషావేత్త డాక్టర్ సంగనభట్ల నర్సయ్య చారిత్రిక పరిశోధనల ఫలితంగా ఇది అపురూపమైన హరిహరనాథ ఆలయంగా భావించ బడుతున్నది. శివ, కేశవులకు అభేదాన్ని పాటించే హరి హర క్షేత్రంలోని ఈఆలయంలో భారత దేశంలో వేరెచ్చటనూ కానరాని విధంగా పానవట్టం మీద నార సింహుని విగ్రహం ఉండడం విశేషం. 11వ శతాబ్దికి చెందిన ఈ ఆలయం మొదట శివాలయమని,తరువాత నారసింహాల యమని,ప్రస్తుతం సత్యవతి అలయమని డాక్టర్ నర్సయ్య పరిశోధన ద్వారా తేల్చి చెప్పారు. ఇక్కడి స్తంభం చాళుక్యుల కాలంనాటి విజయ స్థంభమని పేర్కొన్నారు.ఆరు అడుగుల ఎత్తుగా వితర్ధిక కట్టి,దానిపై ఆలయం నిర్మితమైంది.ఆలయ గర్భంనుండి కప్పును చీల్చుకుని అత్యంత ఎత్తుగా నిలిచిన స్థంభము నానుకునే పానవట్టం, దానిపై లింగం స్థానంలో నరసింహుని విగ్రహం ఉంది. దీని పక్కగా పడగ నీడలో లక్ష్మీనారాయణ విగ్రహం ఉంది. కుడిపక్కన నూనె కారుతున్నంత నునుపు గా అమ్మవారి విగ్రహం ఉంది. ఆళ్వా రుల విగ్రహాలూ ఉన్నాయి. ఆలయ ప్రవేశంలో రెండు ఆంజనేయ స్వామి విగ్రహాలు ఎదురెదురుగా ఉన్నాయి. ద్వారబంధంపై శేషసాయి విష్ణుమూర్తి విగ్రహముంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన సత్యవతీ ఆలయం తదంతర్గత ఇసుకస్థంభం, ఆలయం లోని అరుదైన విగ్రహాలు ప్రస్తుతం ఆదరణ లేక శిథి లావస్థకు చేరుకున్నాయి. బ్రహ్మపుష్కరిణికి ఎత్తయిన ప్రదేశంలోగల సత్యవతీ ఆలయాన్ని తాజామాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవ ఫలితంగా, రాష్ట్ర దేవాదాయ శాఖ స్వాధీన పరుచుకుని, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధంగా జేసి ప్రత్యేక నిధులతో, క్షేత్ర ప్రాధాన్యతను ఇనుమడింప జేస్తూ సనాతన ఆలయాలను పునరుద్ధరించే చర్యలు గైకొనే చర్యలకు శ్రీకారం చుట్టారు. 20లక్షల ప్రత్యేక నిధులతో పునర్నిర్మాణ పనులు మంజూరి అయి టెండర్లు పిలిచారు. సరైన టెండర్లు రానందున పనులు ప్రారంభింప బడ లేదు. ప్రస్తుత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని...దేవాదాయ శాఖ పక్షాన ప్రత్యేక నిధులతో, ఆలయ జీర్ణోద్ధరణ పనులను వెనువెంటనే చేపట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

